# ఆపిల్ పండ్లు

"మావయ్యా! మావయ్యా" పిలుపును పట్టించుకోకుండా ఉండలేక కూర్చున్న స్థలం నుంచి కుంటుతూ కిటికీ దగ్గరకొచ్చాడు టిమ్. మళ్ళీ "మావయ్యా" అని పిలుపు. "ఇదిగో వస్తున్నా" నన్న మావయ్య మాటల్ని వినకుండా నిరంతరంగా పిలుపుల దొంతర- మెల్లగా, అలసటగా, ఏటవాలు ఉపరితలాన్ని ఎక్కుతున్న గూడ్సురైలులా. మావయ్య కిటికీ తలుపు తెరిచి బయటకు చూస్తూ "ఏంటి" అని అడిగాడు.

"నాకో ఆపిల్ కావాలి. ఒక ఆపిల్ తెచ్చివ్వు. వెధవ చెట్టు. ఎక్కడో ఆకాశంలో కాస్తాయెందుకో" అన్నాడు రూపర్ట్ విసుక్కుంటూ.

"చెట్టును తిడితే ఏం లాభం!" మావయ్య విసుక్కున్నాడు.

"మరి నాకందట్లేదు కదా. అందుకే. రా మావయ్యా. ప్లీజ్" బతిమాలాడు రూపర్ట్.

మావయ్య కిటికీ నుంచి దూరంగా వెళ్తూంటే మళ్ళీ పిలుపు "మావయ్యా రా! కిటికీనుంచి కిందికి దూకేయ్. నాకాపిల్స్ కావాలి పొద్దుట్నుంచీ వాటికోసమే చూస్తున్నా."

"నేనేం సర్కస్‌వాణ్ణనుకున్నావా దూకేయడానికి!" అన్నాడు మావయ్య.

"నీ కెప్పుడూ నీ కాలిమీదే ధ్యాస. అమ్మకూడ అంటూ ఉంటుంది. నీ కాలికేమీ కాదులే. దూకేయ్' అరిచాడు రూపర్ట్.

"అని ప్రయోగం చేయడం ఇష్టంలేదు నాకు" అంటూ అవతలికెళ్ళాడు మావయ్య.

మావయ్య దిగివచ్చేసరికి రూపర్ట్ చెట్టు దగ్గరే రెడీగా ఉన్నాడు- చుట్టూ పళ్ళను కొట్టడానికి తెచ్చిపెట్టుకున్న రాళ్ళు, కర్రలు, ఇటుకల ఆకారంలో బొమ్మలూ, చెల్లి ఆడుకునే బొమ్మతో సహా. పైకిచూస్తే ఒక్కొక్క ఆపిల్ మెరుస్తోంది పొద్దుటి సూర్యకాంతిలో.


మావయ్య చెట్టు మొండాన్ని పట్టుకొని ఊపాడు. బలమైన చెట్టు బాధగా, కొద్దిగా ఊగడంతో ఆపిళ్ళు ఒకదాన్నొకటి హాయిగా ముద్దెట్టుకున్నాయి. కానీ ఒక్కటీ రాలలేదు. అలసటగా పైకి చూస్తూ మావయ్యన్నాడు "ఎందుకురా. అవింకా పచ్చిగానే ఉన్నాయి. ఇంకో నెలగ్గాని పండవు." ఏడుపు మొహం పెట్టాడు రూపర్ట్.

"ఏడవకురా బాబు. నెలరోజుల్లో కావలసినన్ని పళ్ళొస్తాయి. ఏం చేయాలో తోచక పిచ్చెక్కేటన్ని పళ్ళొస్తాయి" టిమ్ అన్నాడు.

"నెల రోజుల తర్వాత నాకెందుకూ. నాకిప్పుడే కావాలి" పెద్దగా ఏడవడం మొదలెట్టాడు రూపర్ట్.

ఆంగ్లమూలం: ఎల్.పి.హార్ట్లీ

స్వేచ్ఛానువాదం: ఎమ్. శ్రీధర్



ముప్పై సంవత్సరాల కాలం ఆపిల్ చెట్టులో కొట్టొచ్చే మార్పును తెచ్చింది. కొవ్వొత్తి వెలుతురులోనూ ఈ మార్పును గమనించ గలిగాడు మావయ్య. చెట్టుక్రింద బ్రిడ్జి టేబుల్ మీద నాలుగు కొవ్వొత్తులూ, పక్కన చిన్నబల్లమీద మరొకటీ, గ్లాసులూ వగైరా ఉన్నాయి. చెట్టు కృశించినట్లుంది. క్రిందివైపు కొమ్మల్లో జీవం లేనట్లనిపిస్తుంది. ఆకులు తక్కువగా, చిన్నవిగా .కనిపిస్తున్నాయి. రూపర్ట్‌మాత్రం చాలా ఎదిగాడు. సెప్టెంబర్ రాత్రి దట్టంగా, ప్రశాంతంగా, వెచ్చగా ఉంది. నిశ్చలంగా మండుతున్న కొవ్వొత్తి వెలుతురులో రూపర్ట్ ముఖం మెరుస్తున్న రాగిపాత్రలా వెలిగి పోతోంది. కూర్చున్న పేముకుర్చీ అతని బరువును మోస్తూ, మూలుగుతూ ఉంది. అతని కళ్ళు తదేకంగా తనతోటి పార్ట్‌నర్ వంక చూస్తున్నాయి. ఒక్కసారిగా ఆట ఆపి ప్రక్కకి చూసిందామె.

"నాలుగు. రబ్బరయిపోయింది." రూపర్ట్ అన్నాడు.

"చాలా రాత్రయింది. చల్లబడింది. మూడు కావచ్చింది." అన్నాడు మావయ్య

రూపర్ట్ స్కోరు లెక్కవేస్తూ అడిగాడు.

"1200. సరేనా?" ఎవరూ అడ్డు చెప్పలేదు.

"ఇంకో రౌండు వేద్దామా?" రూపర్ట్ అన్నాడు మావయ్య మాటల్ని లెక్కచేయకుండానే.

"విస్కీ ఐతే రెడీ" అన్నాడొకడు.

"నువ్వు తీసుకుని నాకూ పట్రా. మరి నీకేమో "క్రెమ్ ద మెంత్" ఉంది బర్డీ" అన్నాడు రూపర్ట్.

నాకభ్యంతరంలేదంది తను.

ఈలోగా చుట్ట వెలిగించి రూపర్ట్ "మరి ఆట కొనసాగిద్దామా" అని అడిగాడు.

ఎవరూ జవాబివ్వలేదు.

"మీ మావయ్య-మనల్ని లోపలికెళ్ళమంటున్నారు" అంది బర్డీ.

"ఓ, మావయ్యా! ఆయనవన్నీ పాత కాలపు ఆలోచనలు. కదు మావయ్యా!" రూపర్ట్ మావయ్యనడిగాడు.

"నిన్ను మార్చాలని నేను ప్రయత్నించట్లేదు. టైం మూడైందన్నానంతే" మావయ్య బదులిచ్చాడు.

"అవును, నిజమే. బాగా రాత్రయింది. అందుకే ఇంకా ఆడుతున్నాం. మావయ్యా, విస్కీ తీసుకోరాదూ. బాధలన్నిటినీ మరిపిస్తుంది" రూపర్ట్ అంటూ ఉండగానే అందరూ లేచారు.

నే బయటకు వెళ్లొస్తానన్నాడొకడు.

"నన్ను పడక్కు చేర్చరూ!" అంది బర్డీ. పక్కున నవ్వారందరూ.

అందరూ వారి వారి కొవ్వొత్తుల్ని ఆర్పేశారు. రూపర్ట్ తప్ప ఆర్పే ప్రయత్నంలో క్రిందపడ్డ కొవ్వొత్తిని కాలితో ఆర్పాడతను. అంతా చీకటి. మావయ్యకు కూడా చీకటేననిపించింది. రూపర్ట్ తూలుతూ వెళ్ళి ఆపిల్ చెట్టు మొండెంమీద పడ్డాడు. ఒక్కసారిగా పళ్ళన్నీ పండినట్లయింది. ఒక బలమైన కొమ్మ విరిగి గ్లాసులున్న బల్లపైపడి కిందికొరిగింది. మావయ్య అగ్గిపుల్ల గీచి జరిగిందంతా చూశాడు. ఏమంత ప్రమాదం జరగలేదు. పళ్ళన్నీ నేలంతా పరచినట్లు పడి ఉన్నాయంతే. రూపర్ట్ తేరుకున్నాడు.

అగ్గిపుల్ల ఆరిపోయింది.

"ఏం చేద్దాం ఇన్ని పళ్ళతో," అడిగాడు అందరిలా నడవలేని మావయ్య, "ఇలాగే వదిలేద్దామా ఐతే?" సమాధానంలేదు.

